www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:01, ఆదివారం, 22.10. 2023

## ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణు దేవ్ సాయ్



- ఉత్కంఠకు తెరదించిన బీజేపీ హైకమాండ్
- రాయ్ పూర్ లో బీజేపీ ఎల్పీ సమావేశం
- అనంతరం నిర్ణయం ప్రకటన

..మిగతా 2 లో



## మీరు సభకు రావాలి.. మాకు సలహాలు ఇవ్వాలి

- మాజీ సీఎం కేసీఆర్ ను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రులతో కలిసి యశోద ఆస్పత్రికి వెళ్లిన సీఎం
- రేవంత్ రెడ్డికి సర్వత్రా ప్రశంసలు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకొని అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను రేవంత్ పరామర్శించారు. మంత్రి సీతక్క, షబ్బీర్ అలీతో కలిసి ఆస్పత్రికి వెళ్లిన రేవంత్.. కేసీఆర్‌ను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని మాజీ మంత్రి కేటీఆర్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వెలుపల మీడియాతో సీఎం మాట్లాడారు. "కేసీఆర్‌ను పరామర్శించాను.. క్రమంగా కోలుకుంటున్నారు. ఆయన వైద్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించా. కేసీఆర్ త్వరగా కోలుకొని అసెంబ్లీకి రావాలని ఆకాంక్షిస్తున్నాం. మంచి ప్రభుత్వ పాలన అందించడానికి ఆయన సూచనలు అవసరం ఉంది. ప్రజల పక్షాన అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరముంది. త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కేసీఆర్‌ను కోరా" అని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తన నియోజకవర్గానికి చెందిన కార్యకర్తను పరామర్శించేందుకు యశోద

..మిగతా 2 లో



## రూ. 290 కోట్లు ఎవరివో రాహుల్‌గాంధీ చెప్పాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి
- పైళ్ల మాయంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలు కీలక ఫైళ్లు మాయమయ్యాయని, ఆ ఫైళ్ల మాయంపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని పట్టుపట్టారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదిలా ఉండగా బీజేపీ పక్షనేత ఎవరనే అంశంపై పార్టీలో చర్చించాల్సి ఉందని, ఆ తర్వాతే ఎవరనేది నిర్ణయిస్తామని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉంటే మూడు రోజులుగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంటిపై ఐటీ అధికారుల తనిఖీలు చేస్తున్నారని, దేశం మొత్తం విస్తుపోయేలా రూ.290 కోట్లు దొరికాయని ఆయన చెప్పారు.

ఇప్పటి వరకు 40కి పైగా సంచులు లెక్కపెట్టారని, ఇంకా 90కి పైగా సంచులు లెక్కపెట్టాల్సి ఉందన్నారు. ఎన్నడూ ఇంతపెద్ద అమౌంట్ దొరకిన దాఖలాలు లేవని, ఆ డబ్బును లెక్కపెట్టేందుకు కౌంటింగ్ మిషన్స్ కూడా సరిపోవడం లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఎలక్షన్ కమిషన్‌కి ధీరజ్ సాహు చూపించిన ఆస్తి చాలా తక్కువ అని పేర్కొన్నారు. కానీ ఇక్కడ లెక్కపెట్టలేనంత సంపద దొరకడం చూస్తే ఎంత అవినీతి చేస్తున్నారో అర్థమవుతోందని పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న దస్తావేజులు అక్కడ ఉన్న ఆస్తులకు ఏమాత్రం పొంతన లేకుండా ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. ధీరజ్ సాహుకు రాంచీలోని 8 బ్యాంకుల్లో 7 కు పైగా లాకర్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు.

అక్రమ సంపాదనకు సంబంధించిన వివరాలు ఉన్న కంప్యూటర్స్‌ను అల్మారలో గుర్తించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు.., రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడని కిషన్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న విషయాలకు స్పందిస్తూ ట్విట్టర్‌లో పోస్టులు పెట్టే రాహుల్ ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ఆ డబ్బు ఎవరిదో రాహుల్ గాంధీ చెప్పాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. లోక్ సభ ఎన్నికల్లో మూడుసార్లు ఓడిపోయినా కూడా ధీరజ్ సాహును మూడుసార్లు రాజ్యసభకు ఎన్నుకున్నారని ఆయన వెల్లడించారు. ధీరజ్ సాహుపై ఎందుకు అంత

..మిగతా 2 లో

## 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తాం

- గ్యారెంటీలకు వారంటీ లేదన్నారు
- మేం అమలు చేసి చూపిస్తాం
- 2 గ్యారెంటీల అమలు ప్రారంభించాం
- ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తీసుకొస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని 10కి 9 స్థానాల్లో (ఒకటి సీపీఐ) గెలిపించిన ప్రజలకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. రేవంత్ రెడ్డి, తాను కలిసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను మొదటి 100 రోజుల్లోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తాము ప్రకటించిన 6 గ్యారెంటీలకు వారెంటీ లేదని నాటి ప్రభుత్వం హేళన చేసిందని, గత ప్రభుత్వానికి ప్రజలు చెంప పెట్టుమనిపించారని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని రేవంత్ రెడ్డి, తాను కలిసి శనివారం మధ్యాహ్నం ప్రారంభించామని ప్రస్తావించారు. ఖమ్మం నగరంలో బస్‌లను ప్రారంభించామన్నారు. రాష్ట్ర ప్రజలకు ప్రధాన అవసరమైన ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుచి రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. తాము ప్రకటించిన 6 గ్యారెంటీలలో 2 గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేశామని, మిగతా గ్యారెంటీలను 100 రోజులు కాకముందే అమలు చేస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలదని, దీనిని ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని ప్రోత్సహిస్తామని, ఇందిరమ్మ రాజ్యంలో అందరికి ఇళ్లు, ఆరోగ్యశ్రీ, పింఛన్‌లు లాంటివి అందిరికీ లభిస్తాయన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను తీసుకొచ్చి జిల్లా ప్రజల కాళ్లు కడుగుతామని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ తరపున జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు.

**కబ్జాలు లేని ఖమ్మంను అందిస్తా**

**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

"ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. భావోద్వేగంతో ఉన్న ప్రజలను అర్థం చేసుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగానే ఉన్నప్పటికీ ప్రజల కష్టాలు తీరుస్తాం. ముస్లిం, వక్ఫ్ ఆస్తులను, రైతాంగం భూమి వాళ్లకి ఇచ్చేలా రెవెన్యూ మంత్రి పనిచేస్తారు. సీతారామ ప్రాజెక్టుతో గోదావరి నీళ్లు తెస్తాను. పది లక్షల ఎకరాలు సాగవుతాయి. నా జీవిత లక్ష్యం, నా కోరిక గోదావరి జలాలు ఖమ్మం జిల్లా రైతాంగానికి అందించటం. ఎన్నికల సమయంలో స్వేచ్ఛ, కబ్జాలు లేని ఖమ్మంను ఇస్తానని హామీ ఇచ్చా. కబ్జాలు లేని ఖమ్మం కావాలని మీరు కోరారు. మీ కోరికను నెరవేరుస్తా. ప్రశాంతమైన ఖమ్మం, కబ్జాలు లేని ఖమ్మం, నిర్బంధాలు లేని ఖమ్మం మీకు అందిస్తా" అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

**6 గ్యారెంటీలలో రెండింటిని అమలు చేశాం**

**- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

" ఇందిరమ్మ రాజ్యం కావాలని కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు. మేము ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలలో 2 గ్యారెంటీలను అమలు చేశాం. 6 గ్యారెంటీలతోనే సరిపెట్టుకోకుండా ఇవ్వని హామీలను కూడా

..మిగతా 2 లో

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 'కోమటిరెడ్డి'

- హాజరైన రాజగోపాల్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు..
- రాష్ట్రంలో రహదారులన్నీ నెల రోజుల్లో పూర్తి చేస్తం
- హైదరాబాద్‌నల్గొండ రోడ్డును ఆరులైన్లుగా నిర్మిస్తం
- పలు పాత భవనాలు కూల్చివేత, నిర్మాణం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సెక్రటేరియట్ లోని చాంబర్‌లో కోమటిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, సోదరుడు, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కుందూరు జయ్‌వీర్‌శుభాకాంక్షలు తెలిపారు. వేదపండితులు కోమటిరెడ్డిని ఆశీర్వదించారు. ప్రస్తుతం కొత్త సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ టాలీవుడ్ కి ఎంత మేరకు సహకారం అందిస్తుందో చూడాలి. సినీ కార్మికులకు ఉన్న కష్టాలు, జూనియర్ ఆర్టిస్టులకు ఉన్న సమస్యలు, మేకింగ్ కొరకు కొత్త పర్మిషన్లు ఇలా.. సంక్షేమం వంటి విషయాల్లో ఎలాంటి కొత్త నిర్ణయాలతో మంత్రిత్వ శాఖ సహకరిస్తుందేమో చూడాలి. సంక్షేమంలో భాగంగా అందరూ కోరుకుంటున్న నంది అవార్డులను కనీసం ఈ సారైనా వచ్చిన కొత్త ప్రభుత్వం అయినా పెద్ద మనసు చేసుకొని ఇస్తుందా? అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు సినీ పెద్దలు.

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ సమానంగా అందరికీ నంది అవార్డులు ఇచ్చిన విషయం తెల్సిందే. త్వరలోనే నంది అవార్డుల విషయంలో టాలీవుడ్ ప్రముఖులు మంత్రి కోమటిరెడ్డిని కలిసి చర్చించే అవకాశాలు ఉన్నాయని సినిమా ఇండస్ట్రీ విశ్లేషకుల నుంచి సమాచారం. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొత్తం తొమ్మిది నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై మంత్రి సంతకాలు చేశారు. కుందూరు జయవీర్, బాలూ నాయక్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రోడ్లుభవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్

..మిగతా 2 లో

## కార్పొరేషన్ పోస్టులు ఊస్ట్

- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- ఎన్నికల ముందు హడావుడిగా పదవుల పంపకం
- వారందరికీ ఊడిన పదవులు
- కీలక జీవో జారీ చేసిన ప్రభుత్వం

..మిగతా 2 లో

## బీఆర్ఎస్ దోపిడీ పాలనకు చరమగీతం

- ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ ప్రజల ఆకాంక్ష
- జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను రిలీజ్ చేయాలి
- ప్రజలే పాలకులన్న కాంగ్రెస్ ఆచరణలో చూపాలి
- రాష్ట్ర మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

..మిగతా 2 లో

# ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణు దేవ్ సాయ్

- ఉత్కంఠకు తెరదించిన బీజేపీ హైకమాండ్
- రాయ్ పూర్ లో బీజేపీ ఎల్పీ సమావేశం
- అనంతరం నిర్ణయం ప్రకటన

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఎవరన్న సస్పెన్స్‌కు తెర దించింది బీజేపీ అధిష్టానం. కేంద్ర మాజీ మంత్రి, ఆ రాష్ట్ర బీజేపీ మాజీ చీఫ్ విష్ణు దేవ్ సాయ్‌ను ఛత్తీస్‌గఢ్ తదుపరి ముఖ్యమంత్రిగా ప్రకటించింది. రాయ్‌పూర్‌లో ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశం అనంతరం ఈ మేరకు ప్రకటన చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నార్త్ ఛత్తీస్‌గఢ్‌లోని కుంకూరి నుంచి సాయ్ విజయం సాధించారు. నార్త్ ఛత్తీస్‌గఢ్‌లోని అన్ని స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. విష్ణుదేవ్ సాయ్..దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్ డివిజన్లలో బలమైన సామాజికవర్గంగా ఉన్న సాహు కమ్యూనిటీకి చెందిన వారు. ఛత్తీస్‌గడ్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 54 స్థానాలు గెలిచింది. 2018 ఎన్నికల్లో 68 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ ఈ సారి 35 స్థానాలకే పరిమితమైంది.బీజేపీ అగ్రనేత రమణ్‌సింగ్‌ను సీఎంగా ఎంపిక చేయకుంటే ఓబీసీని సీఎం చేస్తారని మొదట ప్రచారం జరిగింది. ఐతే ఈ ప్రచారాలను పక్కన పెట్టిన బీజేపీ వ్యూహాత్మకంగా గిరిజన నేతను సీఎంగా ఎంపిక చేసింది. ఐతే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ఎంపిక జరిగినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ జనాభాలో 32 శాతం షెడ్యూల్ తెగలకు చెందిన వారున్నారు.

ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. ఐతే ఇవాళ ఛత్తీస్‌గఢ్ సీఎంను ప్రకటించిన బీజేపీ అధిష్టానం..మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులను ఫైనల్ చేయాల్సి ఉంది

# 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తాం. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు. హామీలు అమలు చేయాలని ఒక మాజీ మంత్రి అంటున్నారు. రాగానే హామీలు అమలు చేయమని అడగడానికి కనీసం ఉండాలి. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన మీరా కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడేది. తెలంగాణ ప్రజలకు 100 రోజుల్లో పథకాలను అమలు చేసి తీరుతాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత 9 ఏళ్లు గడిచినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు మీరు. గురివింద గింజకు ఉన్న నలుపు కంటే ఎక్కువ నలుపు మీ కింద పెట్టుకుని కాంగ్రెస్ గురించి మాట్లాడతారు. తెలంగాణ రాష్ట్ర సొమ్మును అక్రమంగా కొల్లకొట్టిన పందికొక్కుల దగ్గర నుంచి కక్కిస్తాం'' అంటూ బీఆర్ఎస్‌పై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు.మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఈ ముగ్గురు నేతలకు ఘనస్వాగతం లభించింది. గజమాలతో కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు ఆహ్వానించారు. ముగ్గురు మంత్రులు అమరవీరులకు నివాలులు అర్పించారు. అనంతరం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుని ప్రారంభించారు.

# రూ. 290 కోట్లు ఎవరివో రాహుల్‌గాంధీ చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

ప్రేమ చూపిస్తున్నారో రాహుల్ చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులుగా ఉన్న పలువురు గతంలో అవినీతికి పాల్పడి తీహార్ జైల్లో ఉన్నారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు.

కాంగ్రెస్.. అవినీతి చేసే ముఖ్యమంత్రులను, ఎంపీలను ఏటీఎంలుగా మార్చుకుందని కేంద్ర మంత్రి ఆరోపణలు చేశారు. యూపీఏ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. తనిఖీల్లో లభ్యమైన డబ్బంతా పార్లమెంట్ ఎన్నికల కోసం కూడబెడుతున్న నోట్ల గుట్టలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ కు, అవినీతికి విడదియలేని బంధం ఉందని కిషన్ రెడ్డి ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారం లో ఉంటే అక్కడ అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్.. దేశ ఆర్థిక వ్యవస్థను చెదలు పట్టినట్టుగా తొలుస్తుందని విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రం నుంచి వందల కోట్లు తెలంగాణ ఎన్నికలకు తరలిస్తూ పట్టుబడటం చూశామని, ధీరజ్ సాహులాగే కర్ణాటకలో మరో నాయకుడు ఈ డబ్బు ఏర్పాటు చేశారని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ దోపిడీకి భయపడి అక్కడి బిల్డర్స్ పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెబుతారని, ప్రజలు మరొకసారి బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

# మీరు సభకు రావాలి.. మాకు సలహాలు ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

ఆస్పత్రికి వచ్చినట్లు ఆయన చెప్పారు. అనంతరం అక్కడే కేసీఆర్ కుటుంబ సభ్యులను కలిశానన్నారు. ''కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారని కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను'' అని పొన్నం అన్నారు. కాగా, గురువారం అర్ధరాత్రి ఎర్రవల్లి నివాసంలోని బాత్‌రూంలో కేసీఆర్ జారిపడటంతో ఎడమ తుంటికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రి వైద్యులు ఆయనకు శుక్రవారం రాత్రి తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్న వైద్యులు శనివారం వాకర్ సాయంతో నెమ్మదిగా అడుగులు వేయించారు. సీఎం రేవంత్ రెడ్డి యశోద ఆస్పత్రికి వెళ్లిన తర్వాత తొలుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, యశోద డాక్టర్లను కలిసి మాట్లాడారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ ఎంవీ రావు తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ దోపిడీ పాలనకు చరమగీతం

- ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ ప్రజల ఆకాంక్ష
- జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను రిలీజ్ చేయాలి
- ప్రజలే పాలకులన్న కాంగ్రెస్ ఆచరణలో చూపాలి
- రాష్ట్ర మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో ఒక దశాబ్ధ కాలం పాటు ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగిందని భారత కమ్యూనిస్టు పార్టీ( మావోయిస్టు) రాష్ట్ర కమిటీ ఆరోపించింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించి ప్రజలు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి చెత్తకుప్పలో విసిరేశారని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంచి పాలన అందిస్తుందనో, పూర్తిగా మేనిఫెస్టో అమలు చేస్తుందనో వారికి ఓట్లు వేసి గెలిపించలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడ్డాయని ప్రకటించారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన దోపిడీ కంటే రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరింత ఎక్కువగా దోపిడీ జరిగిందన్నారు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై అన్ని రంగాల్లో, అన్ని సెక్షన్ల ప్రజలు కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి చేపట్టిన అనంతరం ప్రజలే పాలకులు, మేము సేవకులం అంటూ మాట్లాడారని గుర్తుచేశారు. ప్రజలే పాలకులు అని చెబుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజాస్వామ్యం గురించి అడుగుదామన్నారు. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎన్ కౌంటర్లు లేని తెలంగాణను నిర్మించడం సాధ్యమతుందా? జైల్లో ఏళ్ల తరబడి మగ్గుతున్న రాజకీయ ఖైధీలను విడుదల చేయమని ప్రజల కోరుతున్నారన్నారు. విడుదల చేయగలరా? అని ప్రశ్నించారు. అర్బన్ నక్సలైట్లు, మావోయిస్టులంటూ ముద్ర వేస్తూ వారిని అక్రమ కేసుల్లో ఇరికించిన ఊపా చట్టం, ఎన్ఐఏ దాడులు కొనసాగుతున్నాయి.. వాటిని నిలిపివేయండి. వారిపై అక్రమ కేసులు కొట్టివేయండి.

ధర్నా చౌక్‌ను ఎలాంటి ఆంక్షలు లేకుండా పునరుద్ధరించండి. పౌర హక్కులకు, స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగని కనీసం చట్టబద్ధ పాలన కొనసాగించమని ప్రజలు కోరుతున్నారన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి, రాష్ట్రంలో మిగులు భూములను, ప్రభుత్వ బంజరు భూములను వ్యవసాయ కూలీలకు పంచాలని, ప్రాజెక్టుల పేరుతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్మికుల వేతనాలు, క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాజీపేటలో రైలు కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# అందుబాటులో ఉంటాం.. అభివృద్ధి చేసి చూపిస్తాం



- ఎమ్మెల్యేగా గెలిచాక మొదటిసారి పాలకుర్తికి యశస్విని రెడ్డి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డికి గ్రాండ్ వెల్ కం
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ
- గెలిపించినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం
- ఆదరించిన పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకుంటాం
- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి





**పాలకుర్తి,విశాలభారతి:**

ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. అందరికీ అందబాటులో ఉంటానని, వచ్చే ఐదేళ్లలో మునుపెన్నడూ లేనంత అభివృద్ధిని చేసి చూపిస్తానని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి యశస్విని రెడ్డి తన అత్త, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆదివారం పాలకుర్తికి వచ్చారు. శ్రీ సోమేశ్వరలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు.

తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీ సోమేశ్వరలక్ష్మీనరసింహస్వామి టెంపుల్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. రాజీవ్ చౌరస్తాలో మహిళలకు ఫ్రీ జర్నీ పథకాన్ని ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీరెడ్డి పాల్గొని మాట్లాడారు.

**15 ఏళ్లలో జరగని అభివృద్ధిని 5 ఏండ్లలో చేసి చూపిస్తా**

**.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నుంచి మూడు సార్లు ఎన్నికయ్యారని, కానీ ఆయన పెద్దగా చేసిన అభివృద్ధి ఏం లేదని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆయన 15 ఏళ్లలో చేయని అభివృద్ధిని వచ్చే ఐదేళ్లలో చేసి చూపిస్తానని అన్నారు. ఏమాత్రం రాజకీయ నేపథ్యంలేని తమ కుటుంబానికి ఇక్కడి ప్రజలు అండగా నిలబడ్డారని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారం బలంతో ఎన్నికల్లో ఓడించేందుకు తమను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేసుకొని కంటతడిపెట్టారు. కానీ పాలకుర్తి ప్రజలు తమను గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. తనపై నమ్మకం ఉంచి అసెంబ్లీకి పంపించిన ప్రజలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండి ప్రజల కష్టనష్టాల్లో పాలుపంచుకుంటానని భరోసానిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ 6 గ్యారెంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని అన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన గ్యారెంటీలను కూడా అమలుచేసి మాట నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోతో పాటు తన లోకల్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

**పాలకుర్తి ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం**

**.. హనుమాండ్ల ఝాన్సీరెడ్డి**

తమ కోడలు యశస్విని రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించినందుకు పాలకుర్తి ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పాలకుర్తి పౌరుషాల గడ్డ అని యశస్విని రెడ్డి విజయంతో ఇక్కడి ప్రజలు మరోసారి నిరూపించారని అన్నారు. తమకు అండగా నిలబడ్డ ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. పాలకుర్తిని టాక్ ఆఫ్ ది స్టేట్ గా నిలబెట్టిన ఘనత ఇక్కడి ప్రజలదని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందీల స్ఫూర్తితో ముందుకు సాగుతామని అన్నారు. పాలకుర్తి ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించాయని, రాజకీయ కురుక్షేత్రంలో కౌరవులను ఓడించినట్లుగా పాలకుర్తి ఎన్నికల యుద్ధంలో ప్రజలు ఎర్రబెల్లిని ఓడించారని అన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే.. పాలకుర్తి ప్రజలకు మాత్రం 2023 డిసెంబర్ 3న వచ్చిందని అన్నారు. ఎర్రబెల్లి ఓటమితోనే పాలకుర్తి ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. తమను ఎన్నికల్లో ఓడించేందుకు ఎర్రబెల్లి దయాకర్ రావు ఎన్నో కుట్రలు చేశారని, కానీ ప్రజల సహకారంతో వాటన్నింటినీ తిప్పికొట్టామని అన్నారు. ఎర్రబెల్లి 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని కూకటివేళ్లతో పెకలించివేశామని అన్నారు. ఇక తమ ముందున్న లక్ష్యం తన కోడలు యశస్విని రెడ్డిని గెలిపించిన ప్రజల అభివృద్ధి అని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. 6 గ్యారెంటీలతో పాటు మిగిలిన అన్ని పథకాలను అమలు చేస్తామని అన్నారు.

**కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం**

పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగరడానికి కృషి చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కురుక్షేత్రంలా సాగిన పాలకుర్తి ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఓ సైనికుడిలా పని చేశాడని అన్నారు. అధికార బలంతో ఎర్రబెల్లి దయాకర్ రావు తమ కార్యకర్తలు, నాయకులపై అక్రమంగా కేసులు పెట్టించి ఇబ్బంది పెట్టారని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు ఏమాత్రం భయపడలేదని అన్నారు. యశస్విని రెడ్డిని ఓడించేందుకు ఎర్రబెల్లి చివరికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కొనేందుకు ప్రయత్నించారని, కానీ ఎర్రబెల్లి ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిజాయితీగా వ్యవహరించారని అన్నారు. నిఖార్సైన కార్యకర్తలకు నిలువుటద్దంగా పాలకుర్తిలో కాంగ్రెస్ కార్యకర్తలు నిలిచారని కొనియాడారు. గుండెల్లో పెట్టుకొని తమను గెలిపించిన పాలకుర్తి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గెలిపించేందుకు ఈ ఐదేళ్లు శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అందించి పాలకుర్తి ప్రజలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన ఆయా గ్రామాల పార్టీల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇక అధికారిక కార్యక్రమాల్లో జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా వైద్యాధికారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి ఎమ్మెల్యే భరోసా

**పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు ఎనగందుల నాగరాజు తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డిలను కలిసి అభ్యర్థించాడు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలు నాగరాజుకు ఉపాధి కల్పించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తామని అన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు తమ ట్రస్టు ద్వారా ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం దివ్యాంగుడు నాగరాజుతో ఫోటో దిగారు.**







# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 'కోమటిరెడ్డి'



మొదటిపేజీ తరువాయి

కమిషనర్ అశోక్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు మంత్రికి శుభాకాంక్షలు అందచేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ, హెరిటేజ్ భవనంగా ఉన్న శాసనసభ పాత భవనాన్ని పునర్ వ్యవస్తీకరించి దానిలో శాసన మండలి కార్యకలాపాలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న సీఎల్పీ ఇతర పార్టీల కార్యాలయాలున్న భవనాన్ని తొలగించి పబ్లిక్ గార్డెన్ నుంచి లలితా కళా తోరణం వరకు సుందరీకరణ చేసి అసెంబ్లీ ప్రాంగణాన్ని ఒక ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్టు వివరించారు. ఈ విషయంలో మరి కొన్ని రోజుల్లో ముఖ్యమంత్రి, శాసన మండలి చైర్మన్, సంబంధిత అధికారులతో కలసి పరిశీలించనున్నట్టు అన్నారు. రాష్ట్రంలోని రహదారులన్నింటినీ నెలరోజుల్లోగా పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. రానున్న వంద రోజుల్లో తమ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రకటించారు. నిన్న సి.ఎం ప్రారంభించిన మహాలక్ష్మి కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలనుండి అద్భుతమైన స్పందన వస్తోందని తెలిపారు. **మంత్రి సంతకం చేసిన ఫైళ్ల వివరాలు..**

- నల్గొండ జిల్లాలో నల్గొండ నుంచి ముషంపల్లి మీదుగా ధర్మాపురం వరకు రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా మార్చేందుకు రూ. 100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం.
- వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజక వర్గంలో లింగంపల్లి నుండి దుగ్యాల రోడ్డును రూ. 4 .15 కోట్ల వ్యయంతో స్ట్రెంతేనింగ్ చేయడం.
- రాష్ట్రంలో 14 స్టేట్ రోడ్లను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయడం. వీటిలో మల్లెపల్లి నల్గొండ రహదారి, రీజినల్ రింగ్ రోడ్ సౌత్ వైపు ఉన్న చౌటుప్పల్, ఆమనగల్ షాద్‌నగర్‌సంగారెడ్డి రహదారి తదితర రోడ్లు ఉన్నాయి.
- హైదరాబాద్ విజయ వాడ నేషనల్ హై వే ను ఆరు లైన్ల రోడ్డుగా మార్చడం.
- నకిరేకల్‌నాగార్జున సాగర్ మార్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడం.
- హైదరాబాద్‌కల్వకుర్తి జాతీయ రహదారి 765 లోని ఒక సెక్షన్ మార్గాన్ని నాలుగు లైన్లుగా మార్చడం.
- తెలంగాణా రాష్ట్రానికి కేంద్ర రోడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులను అధికంగా కేటాయించేందుకు ప్రతిపాదనలు.
- మరో రెండు పరిపాలనా సంబంధిత ఫైళ్లు.

## తెలంగాణ సాధనకు మంత్రి పదవి త్యాగం..

- మళ్లీ మంత్రి పదవితోనే సెక్రటేరియట్‌కు..
- 2011లో పదవికి రాజీనామా చేసిన 'కోమటిరెడ్డి'
- పన్నెండేండ్ల తర్వాత మళ్లీ సచివాలయానికి వెంకట్‌రెడ్డి

**నల్గొండ, విశాల భారతి:**

2011 అక్టోబర్ 1 న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ఈ రోజు వరకు ఆయన సెక్రటేరియట్ గడప తొక్కలేదు. నీళ్లు, నిధులు, నియామకాలు కావాలంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న రోజులవి తెలంగాణ సాధించుకున్నాకే మళ్లీ సెక్రటేరియట్‌లో అడుగు పెడుతానంటు కోమటిరెడ్డి శపథం చేశారు. తన రాజీనామా పత్రాన్ని నేరుగా గవర్నర్ కే పంపారు. కోమటిరెడ్డి తో పాటు మొత్తం నలుగురు మంత్రుల పదవీ త్యాగంతో తెలంగాణ ఉద్యమానికి పెద్ద ఊపు వచ్చింది. కోమటిరెడ్డి రాజీనామాతో ఆగలేదు. ఆమరణ నిరాహార దీక్ష చేసి కాంగ్రెస్ హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చారు. అప్పటి సీఎం వైఎస్ఆర్ హయాంలో కోమటిరెడ్డి చొరవతో మంజూరైన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ పూర్తి చేయమని కోరేందుకు సీఎం కేసీఆర్ అపాయింట్మెంట్ అడిగినా ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే సెక్రటేరియట్ లోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇన్నాళ్లకు ఆయన శపథం నెరవేరింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
3
ఆదివారం,
22.10. 2023
హైదరాబాద్



# మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలి

**మునుగోడు నియోజకవర్గ యాదవ సంఘం ప్రెసిడెంట్ బట్టు జగన్ యాదవ్**

**విశాల భారతి, మునుగోడు:** తెలంగాణ మంత్రివర్గం లో యాదవులకు స్థానం కల్పించాలని మునుగోడు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు బట్టు జగన్ యాదవ్ డిమాండ్‌చేశారు. ఆదివారం నల్గొండ జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగన్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ కులాల్లో మెజారిటీ ప్రజలున్న యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని గమనించి యాదవులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మేకల యాదన్న యాదవ్, చండూరు మండల ప్రెసిడెంట్ అశోక్ యాదవ్, నాంపల్లి అధ్యక్షుడు పంగ రామ్మోహన్ యాదవ్, మునుగోడు మండల అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి యాదవ్, గట్టుపల్ మండల అధ్యక్షుడు పంకెర్ల ఐలయ్య యాదవ్, కృష్ణ యాదవ్, వెంకన్న యాదవ్, శ్రీను యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇవి నిజంగా శుభగడియలు

- **అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రతిష్టాపన.**
- **ఎమ్మెల్సీ కవిత ట్వీట్**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అయోధ్య రామమందిరంలో వచ్చే నెల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపనతో కోట్లాది హిందువుల కల నిజం కాబోతున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం లో రాములవారిని ప్రతిష్టించే గర్భగుడి ఫొటోలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విడుదల చేసిన నేపథ్యంలో కవిత ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ట్రస్ట్ విడుదల చేసిన అయోధ్య రామ మందిరం గర్భగుడికి సంబంధించిన ఫొటోలతో రూపొందించిన వీడియోను పోస్ట్ కు జత చేశారు. 'అయోధ్యలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపనతో కోట్లాది హిందువుల కల నిజం కాబోతున్న శుభసమయంలో తెలంగాణతో పాటు దేశ ప్రజలందరూ స్వాగతించాల్సిన శుభ ఘడియలు.' అని పేర్కొన్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం జరగాలన్న హిందువుల ఆకాంక్ష త్వరలో నెరవేరుతుండడం సంతోషకరమన్నారు. రామాలయాన్ని సందర్శించడానికి ఎంతో మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

**- ఆస్ట్రేలియాలో సర్వ మత ప్రార్థనలు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పద్నాలుగు సంవత్సరాల క్రితం కేసీఆర్ చేపట్టిన 'దీక్ష'ను గుర్తుచేసుకుంటూ ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్, సిడ్నీ , బ్రిస్బేన్ నగరాల్లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అలాగే గాయపడిన కేసీఆర్ త్వరగా కోలుకోవాలని సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్ష సమయంలో చేసిన త్యాగాలను, రాష్ట్రం సిద్ధించిన తరువాత తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషి, ప్రవేశ పెట్టిన పథకాలు ఎంతో గొప్పవన్నారు. తెలంగాణ కలను సాకారం చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని తన భుజస్కంధాలపై వేసుకొని మునుపెన్నడూ ఎరుగని విధంగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన కేసీఆర్ కృషిని, పట్టుదలను ప్రశంసించారు. దేశ చరిత్రలో కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం ఉప్పు, వినయ్ సన్నీ గౌడ్, విశ్వామిత్ర, ఉదయ్ రెడ్డి, వేణు, సాయి తదితరులు పాల్గొన్నారు.



# క్యాంప్ ఆఫీస్ కేరాఫ్ 'ఎంసీఆర్‌హెచ్‌ఆర్ డీఐ' బిల్డింగ్?

- **సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం**
- **మంత్రులతో కలిసి 'ఎంసీఆర్‌హెచ్‌ఆర్ డీఐ' పరిసరాలను పరిశీలన**
- **హెలీప్యాడ్‌ను మెరుగుపరచాలని అధికారులకు ఆదేశం**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** ఉమ్మడి తెలుగు రాష్ట్రంగా ఉన్నప్పటినుంచి ముఖ్యమంత్రి కోసం ప్రత్యేకించి క్యాంప్ ఆఫీస్ ఉండాలనే సంప్రదాయం గతంలో లేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఎన్నికయ్యాక.. బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ రోడ్‌లో పదిమంది ఐఏఎస్ అధికారులు, 24 ఇతర అధికారుల క్వార్టర్స్‌ను తొలగించి.. తన కోసం క్యాంప్ ఆఫీసు నిర్మించుకున్నారు. చనిపోయేవరకు వైఎస్, ఆ తర్వాత వైఎస్ కుటుంబం కొన్నాళ్లు అందులోనే ఉండేవారు. కానీ.. కొత్త రాష్ట్రం పుట్టి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక.. కేసీఆర్ రూ.38 కోట్ల ఖర్చుతో ఈ క్యాంప్‌ఆఫీస్ రూపురేఖల్ని మార్చేసి.. ప్రగతి భవన్‌గా నామకరణం చేసి.. 2016 నవంబర్ లో ఎంట్రీ ఇచ్చారు. సచివాలయంలో తనకున్న ఛాంబర్‌తో పాటు క్యాంప్ ఆఫీసుగా ప్రగతిభవన్ వేదికగా.. అధికారిక కార్యకలాపాలు నిర్వహించేవారు కేసీఆర్. అవసరాన్ని బట్టి మంత్రుల్ని, అధికారుల్ని ఫామ్‌హౌస్‌కే పిలిపించుకునేవారు. కట్‌చేస్తే.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి శకం మొదలైంది. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టే ప్రగతి భవన్‌ను జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌గా మార్చి.. అక్కడే ప్రజాదర్బార్ షురూ చేశారు. ప్రజాభవన్‌ని ఎలా ఉపయోగించుకోవాలన్న అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి వేరే ఆలోచనలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరి... తాజా సీఎం రేవంత్‌రెడ్డి తాజా క్యాంప్ ఆఫీసు ఎక్కడ? ఎక్కడినుంచి అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తారు అనేది నిన్నటి దాకా కొనసాగిన సస్పెన్స్. కొత్త ఖర్చుతో కొత్త భవనం ఎందుకు.. కొత్తగా కట్టిన సచివాలయం ఉండనే ఉందిగా అక్కడి నుంచే యాక్షన్ పార్ట్ మొదలుపెడతారు అనే చర్చ కూడా సాగింది. కానీ.. రేవంత్ మనసు మాత్రం మరోలా ఆలోచిస్తోంది. జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో తన క్యాంప్ ఆఫీసు నిర్మించుకోనున్నట్టు గతం నుంచి చెబుతూ వస్తున్నారు రేవంత్‌రెడ్డి.

ఆదివారం మాజీ సీఎం కేసీఆర్ ను పరామర్శించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్డీఐకి చేరుకుని, మంత్రులతో కలిసి పరిశీలించారు. ఎలక్ట్రిక్ కార్‌లో ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డీ పరిసరాల్లో పర్యటించారు. ఇదే అధికారిక భవనం అని సీఎం డైరెక్ట్‌గా చెప్పలేదు. కానీ.. దీన్ని క్యాంప్‌ఆఫీసుగా తీర్చిదిద్దడం కోసం ఏమేం మార్పులుచేర్పులు చేయాలో అధికారులతో చర్చించారు. ఇక్కడ ఇప్పటికే ఉన్న హెలిపాడ్‌ను మెరుగు పరచాలని కూడా ఆదేశించారు. రేపటినుంచే పునరుద్ధరణ పనులు మొదలయ్యే ఛాన్సుంది. అటు.. తన ఇంటికి దగ్గరగా ఉండడం వల్ల కూడా దీన్నే క్యాంపు కార్యాలయంగా ఫిక్సయ్యారు రేవంత్‌రెడ్డి. సో.. సీఎం క్యాంప్ ఆఫీసు కేరాఫ్.. ఎంసీఆర్‌హెచ్‌ఆర్ డీఐ ఇది మాత్రం పక్కా..

# ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

**యువనేత లోకేష్ ఎదుట కౌలురైతుల ఆవేదన**



**విశాల భారతి,ఆంధ్రప్రదేశ్:** తుపాను కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా తుని నియోజకవర్గం ఒంటిమామిడి వద్ద పంటపొలాలను యువనేత లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణాపురానికి చెందిన కౌలురైతు యన్నా బాబ్జి లోకేష్‌తో మాట్లాడుతూ నేను 4 ఎకరాల్లో వరి పంటను కౌలుకు సాగు చేశాను. అర ఎకరంలో మిర్చి, మరో అర ఎకరంలో బెండ సాగు చేశాను. వరి, మిరప పంటలు నీటిలో నానిపోయి కుళ్లిపోయాయి. వరిపంట చేతి కొచ్చే స్థితిలో లేదు. మిర్చి మొక్కలు కుళ్లిపోయి నేల కొరిగి పాడైపోయాయి. మొత్తంగా రూ.1.70వేలు నష్టం వచ్చింది. నాకు ప్రభుత్వం నుండి కౌలుకార్డు, ప్రభుత్వ పథకాలు ఏవీ రావడం లేదు. గతేడాది కూడా నేను వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యంమని ఆవేదన చెందారు. తాటేరుపాలెంకు చెందిన మరో కౌలురైతు వీరబాబు మాట్లాడుతూ నేను 3 ఎకరాల్లో వరిపంట కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. మిచౌంగ్ తుఫాను వల్ల పంట మొత్తం నేలకొరిగిపోయింది. వర్షపునీరు పొలాల్లో చేరి పంట మొత్తం కుళ్లిపోయింది. పంట కోత కోసినా ఉపయోగం లేదు. ఇప్పటి వరకు రూ.70వేలు పెట్టుబడి పెట్టాను. జమ్మేరు పూడిక నాలుగేళ్లుగా తీయడం లేదు. దీనివల్ల మా పొలాలన్నీ వర్షాలు వచ్చినప్పుడు మునిగిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం. మాకు కౌలుకార్డు లేదు, ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలని విన్నవించాడు.


*ఒంటిమామిడికి చెందిన కాకాడ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతియేటా మాకున్న 60సెంట్ల పొలంలో పండించుకున్న ధాన్యం తిని బతుకుతున్నాం. పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాను వల్ల మా తిండిగింజలు మొత్తం నేలపాలయ్యాయి. ఇప్పటివరకు రూ.30వేలు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం నుండి మాకు ఇన్ పుట్ సబ్సిడీలు, పంట బీమాలు ఏవీ రావడం లేదని వాపోయాడు. ఈ సందర్భంలో లోకేష్ రైతులతో మాట్లాడుతూ కౌలు రైతులకు న్యాయం చేసేలా మేం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పంటను సాగుచేసే వారికి అందాల్సిన పథకాలను పారదర్శకంగా అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. కౌలు రైతులు నష్టపోకుండా చూస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.



# కాంగ్రెస్ పాలనలో చేనేతకు పూర్వం వైభవం.

- **హామీ మేరకు చేనేత పై జిఎస్టి భరించాలి.**
- **చేనేత వర్గాల చైతన్య వేదిక జాతి అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాస్.**

**ముషీరాబాద్,విశాల భారతి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండి చేనేతకు పూర్వం సంచరించుకుంటుందని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాస్ పేర్కొన్నారు. ఇకపై రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండవని తెలిపారు. బాగ్ లింగంపల్లి లోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేనేత కార్మికులు ఉత్పత్తులపై పడే జిఎస్టి ని ప్రభుత్వమే భరిస్తుందని రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలోని చేనేత ఉత్పత్తి దాదాపు 1000 కోట్లు ఉంటుందని ఐదు శాతం జీఎస్టీ ప్రభుత్వం భరిస్తే కార్మికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఆర్థిక రంగాలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న చేనేత రంగం యొక్క జీవనోపాధి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పాలన ఎంతో దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ శ్రీనివాస్, కే సుదర్శనరావు, చక్రపాణి, నాగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# 'అభినందనల వెల్లువ'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మలక్‌పేటలోని నివాసంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. బొకే అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుకోసం అనునిత్యం కృషి చేసిన నాయకులకు రంగారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా నాయకులు, కార్యకర్తలు చూడాలని రంగారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, డా.రాగ్యానాయక్, దేశ్యానాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వెస్టిండీస్ చేతిలో ఇంగ్లాండ్ చిత్తు

**24 ఏళ్ల తర్వాత మళ్లీ**




వరల్డ్ కప్ కు అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఇంగ్లాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. బార్బడోస్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక వన్డేలో గెలిచిన 24 ఏళ్ల తర్వాత ఇంగ్లాండ్ పై వన్డే సిరీస్ గెలిచిన రికార్డును సొంతం చేసుకుంది. ఆదివారం ఇంగ్లాండ్ తో జరిగిన మూడో వన్డేలో వెస్టిండీస్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దాంతో మూడు వన్డేల సిరీస్ ని 21 తేడాతో గెలిచింది. 24 ఏళ్ల తర్వాత ఇంగ్లాండ్ పై వన్డే సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. విండీస్ చివరగా 1998లో ఇంగ్లాండ్ పై వన్డే సిరీస్ లో గెలిచింది. తాజా విజయంతో 24 ఏళ్ల నిరీక్షణకు తెరదించినట్లైంది. ఇక మ్యాచ్ వివరాల్లోకి వెళితే... వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించారు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ బెన్ డకెట్ (71) అద్భుత ఇన్నింగ్స్‌తో 9 వికెట్లు కోల్పోయి 40 ఓవర్లలో 206 పరుగులు చేసింది. ఆ తర్వాత మరోసారి వర్షం పడింది. దాంతో విండీస్ లక్ష్యాన్ని 188 పరుగులకు కుదించారు. ఆ లక్ష్యాన్ని వెస్టిండీస్ 31.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేధించింది. అథనాజ్ (45), కార్టీ (50) పరుగులతో రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో విల్ జాక్స్ 3, అట్కిన్సన్ 2 వికెట్లు పడగొట్టారు. సిరీస్ మొత్తం అద్భుత ప్రదర్శన చేసిన విండీస్ కెప్టెన్ షాయ్ హోప్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది.

# ఒక్క ఓటమితో రోహిత్ బ్యాడ్ కెప్టెన్ అయిపోయాడా ?

**హిట్ మ్యాన్‌కి బాసటగా నిలిచిన గంభీర్**



వరల్డ్ కప్ లో సెమీస్ దాకా సాధికారికంగా ఆడి ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది భారత్. ఆ ఓటమిని భారత్ ఇంకా జీర్ణించుకోలేకపోతోంది. హిట్ మ్యాన్ రోహిత్ కెప్టెన్సీపై క్రికెట్ ప్రపంచం అప్పటిదాకా ప్రశంసలు కురిపించింది. కానీ ఫైనల్లో ఓటమి తర్వాత అతన్ని పాతాళానికి తోసేసింది. దాంతో రోహిత్ పై అన్ని వేళ్లూ మళ్లుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ హిట్ మ్యాన్‌ని వెనకేసుకొచ్చాడు. ఒక్క ఓటమితో రోహిత్ బ్యాడ్ కెప్టెన్ అయిపోతాడా ? ఐపీఎల్‌లో ఐదు ట్రోఫీలు గెలిపించడం అంత ఈజీ కాదు. ఈ వన్డే వరల్డ్ కప్ లో భారత్ అధిపత్యం ప్రదర్శించిన తీరు అద్భుతం. వరల్డ్ కప్ ఫైనల్ కు ముందు కూడా ఇదే విషయం చెప్పాను. ఫైనల్లో ఎలాంటి ఫలితం వచ్చినా... భారత్ ఛాంపియన్‌లా ఆడింది. ఒక బ్యాడ్ గేమ్ రోహిత్ శర్మను అతని జట్టును చెడ్డగా మార్చదు. పది మ్యాచుల్లో ఎంతో గొప్పగా ఆడారు. ఒక్క ఓటమి కారణంగా రోహిత్ ను బ్యాడ్ కెప్టెన్ అనడం సరికాదని గంభీర్ వివరించాడు. ఇక వచ్చే పొట్టి వరల్డ్ కప్ లో రోహిత్ ఫామ్ లో ఉంటే అతన్ని ఆడించాలని, దానికీ రోహిత్ నే కెప్టెన్ గా నియమించాలని గంభీర్ డిమాండ్ చేశాడు.

# కార్పొరేషన్ పోస్టులు ఊస్ట్

- **రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం**
- **ఎన్నికల ముందు హడావుడిగా పదవుల పంపకం**
- **వారందరికీ ఊడిన పదవులు**
- **కీలక జీవో జారీ చేసిన ప్రభుత్వం**

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలు, పదవీకాలం పొడిగింపు నిర్ణయాలను రద్దు చేస్తూ రేవంత్ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓని అమల్లోకి తీసుకురావాలని సీఎస్‌ని ఆదేశించారు. దీంతో ఇప్పటి వరకు ఆయా పదవుల్లో ఉన్న వారందరూ ఇంటి దారి పట్టనున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వ సలహాదారులను రేవంత్ ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే.

**రేవంత్ ప్రభుత్వం తొలగించింది వీరినే..**

1. విజయసింహారెడ్డి
2. తాడికొండ రాజయ్య
3. కొండబాల కోటేశ్వరరావు
4. గట్టు తిమ్మప్ప
5. మార గంగారెడ్డి
6. కంచర్ల రామకృష్ణారెడ్డి
7. వరప్రసాద్ రావు
8. వేద రజిని
9. పిట్టల రవీందర్
10. దూదిమెట్ల బాలరాజు యాదవ్
11. భరత్ కుమార్
12. పల్లె రవికుమార్
13. నంది కంటి శ్రీధర్
14. రవీందర్ సింగ్
15 ఆయాచితం శ్రీధర్
16. ప్రొఫెసర్ కే లింబాద్రి

# మిషన్ భగీరథతో ఆడబిడ్డల కష్టాలను తీర్చిన కేసీఆర్

**- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**



**విశాలభారతి, హైదరాబాద్:** తాగు, సాగునీటి సమస్యలను తీర్చిందేకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు ప్రణీత్ పనోరమ కాలనీలో మిషన్ భగీరథ పథకం) ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికి రక్షిత మంచినీటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే నాటి సీఎం కేసీఆర్ ఆడబిడ్డల కన్నీటి కష్టాలను తీర్చేందుకు వేల కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకంతో తాగు నీటి సమస్య తీరిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, స్థానిక కౌన్సిలర్ చంద్రకళ గోపాల్, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# రామచంద్రునాయక్ ను సన్మానించిన సీపీఐ

**మహబూబాబాద్' విశాల భారతి:** ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ ని హైదరాబాదులో సిపిఐ నాయకత్వం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పేద బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిస్తూ, డోర్నకల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికై ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, గీత పనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండారి రమేష్ ,కన్నే వెంకన్నలు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అప్పులపై విచారణ జరపిస్తాం

- ప్రభుత్వ స్థలాలు, నాళాల అక్రమాలపై విచారణ జరిపిస్తాను
- జగదీష్ రెడ్డి పై నైతికంగా నేనే విజయం సాధించాను
- ఆక్రమాలకు పాల్పడిన జగదీష్ రెడ్డిని జైలుకు పంపిస్తా
- మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి




**సూర్యాపేట, విశాలభారతి:** విద్యుత్ శాఖలో జరిగిన 85 వేల కోట్ల అప్పులపై విచారణ జరపిస్తామని , అట్టి అక్రమాలపై గత పది సంవత్సరాలుగా విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థలలో 85 వేల కోట్ల బాకాయిలకు బాధ్యులైన కేసీఆర్, జగదీశ్ రెడ్డి పై విద్యుత్ అధికారులపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వము లోతుగా విచారణ చేపట్టి బాధ్యులైన అప్పటి విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డిని జైలుకు పంపే వరకు పోరాడుతామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొన్ని చోట్ల బీఆర్ఎస్ నాయకులకు జగదీశ్ రెడ్డి కేటాయించిన ప్రభుత్వ భూముల కేటాయింపు పై విచారణ చేసి అట్టి భూములను అర్హులైన పేదలకు పంచుతామన్నారు. సూర్యాపేట శాసనసభ ఎన్నికలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పై నైతికంగా నేనే విజయం సాధించానని, జగదిష్ రెడ్డికి గెలుపు కంటే వ్యతిరేకంగా వచ్చిన ఓట్లే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గతంలో జగదీశ్ రెడ్డి కేవలం 198 మందికి ఇల్లులు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేస్తుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, తూముల సురేష్ రావు, కందాల వెంకట్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరు శైలేందర్, పట్టణ పార్టీ అధ్యక్షులు అంజత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు, ఎస్సీసెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాలు గౌడ్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జహీర్,నాగుల వాసు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# దుర్మార్గపు పాలన పోయి ప్రజా ప్రభుత్వం వచ్చింది

**తుంగతుర్తిzవిశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన పోయి ప్రజలు కోరుకునే ప్రజా ప్రభుత్వం వచ్చిందని ఎమ్మెల్యే మందల సామేలు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షలు బీమా పథకాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఎక్కువ శాతం నిరుపేద ప్రజలు మాత్రమే ప్రభుత్వాసుపత్రికి వస్తారని అలాంటి వారికి సేవ చేసి వారి ప్రాణాలను కాపాడాలని అన్నారు. విధుల పట్ల అలసత్వం వహించకూడదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజలకు చాలా చేరువగా ఉండే ప్రభుత్వం అని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ పథకం కింద ఒక వ్యక్తికి ఒక సంవత్సరానికి 10 లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ వేసిన రోడ్డు తప్ప బి.ఆర్. ఎస్ ప్రభుత్వం వేసిన రోడ్లు లేవని రోడ్లన్నీ మరమత్తు చేసుకోవాల్సిన అవసరం ఉందనన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో 6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్య వైద్య రంగాల్లో నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందని వాటిని అభివృద్ధి చేయాలి అని అన్నారు. ముఖ్యంగా యువకులు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు నియోజకవర్గంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయా తప్ప వాటిలో వసతులు సరిగా లేక విద్యార్థులకు సరియైన వసతులు ఉపాధ్యాయులు లేక ఇబ్బందులకు గురయ్యారని అలాంటి పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉండదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం అని రైతులెవరు ఉధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. తుంగతుర్తి ప్రజలు మెజార్టీతో గెలిపించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ వెంకట్రావు, పిడి కిరణ్ కుమార్, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న, గుడిపాటి నరసయ్య, అధికారులు మహిళలు పాల్గొన్నారు.



# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఘన సన్మానం

**చౌటుప్పల్, విశాల భారతి:** మండల కేంద్రంలోకి శాసనసభ ఎన్నికైన తర్వాత తొలిసారి చౌటుప్పల్ మండలం రావడంతో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందగళ్ళ సతీష్ గౌడ్, మరియు మండల యూత్ నాయకులు తూర్పునూరు రవి గౌడ్, కిన్నె రవికుమార్ శాలువా కప్పి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



### భేదం లేకుండా విద్యార్థులందరికీ

# ఉచిత బస్ పాస్ ఇవ్వాలి

**డి రవి పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**గరిడేపల్లి, విశాల భారతి:** లింగ బేధం లేకుండా విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ ఇవ్వాలని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి ప్రభుత్వాన్ని కోరారు. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం(పి వై ఎల్ ), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి డి ఎస్ యు) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా వెల్దండ మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పివైఎల్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ అహంకారం, నియంతృత్వం తారస్థాయి చేరడం, విద్యార్థి, నిరుద్యోగుల, ప్రజల సమస్యలను గాలికి వదలడంతో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని అన్నారు. నిరుద్యోగులను, విద్యార్థులను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికి అయినా ఇదే గతి పడుతుందని అన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువుకు ఏటువంటి ఆటంకాలు లేకుండా తగిన రకాల వసతులు సౌకర్యాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని విస్తృతంగా తమతమ వేదికల్లో, మ్యానిఫెస్టోలో ప్రచారం చేశారు. అది నమ్మిన ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు బస్ పాస్ ఛార్జీలు విపరీతంగా పెంచడంతో తగ్గించాలని వివిధ సందర్భాల్లో విద్యార్థులు ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో లింగ భేదం లేకుండా విద్యార్థులందరికి ఉచితంగా బస్ పాస్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కామల్ల సుందరయ్య, జిల్లా నాయకులు కారింగుల నాగరాజు, పిడిఎస్యు జిల్లా నాయకులు కామల్ల బాలు, ఉదయ్, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి వలపుదాసు నరేష్, పి డి ఎస్ యు, పివైఎల్ వెలిదండ గ్రామ కమిటీ నాయకులు యశ్వంత్, చరణ్, అచ్యుత్, నరసింహారావు, శ్రీను, సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**సూర్యాపేట, విశాలభారతి :** కేసీఆర్ త్వరగా కోలుకోవాలని సూర్యాపేట మండల ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి ఆదివారం సూర్యాపేట మండలం సోలిపేట గ్రామంలోని శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లోని ఫామ్‌హౌస్‌లో బాత్‌రూమ్‌లో కాలుజారి కిందపడి గాయపడ్డ కేసీఆర్ ..యశోద ఆస్పత్రిలో చికిత్స పొందున్న ఆయన త్వరగా కోలుకోవాలని పూజలు చేసినట్లు ఆయన వెల్లడించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ కేసీఆర్‌కు ఉంటాయని అన్నారు. తెలంగాణ కోసం నిరంతరం పరితపించే నాయకుడు కేసీఆర్ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందుల కుశలవ రెడ్డి ,నర్రా పరమేష్,బొడ్డు రవీందర్ , బొడ్డు బాలకృష్ణ,తలారి సతీష్, ఈదుల మధుసూదన్, పోలేపాక శ్యాంసుందర్, సంపత్ సురేందర్ తదితరులు ఉన్నారు.



# అయ్యప్ప దేవాలయలో అన్నదానం

**చౌటుప్పల్ విశాల భారతి:** పట్ట కేంద్రంలోని శ్రీ సత్య దేవ సహిత అయ్యప్ప దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహణలో భాగంగా ఈరోజు అన్నదాన కార్యక్రమంసుర్వి నరసింహ గౌడ్ మంజుల దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు ఈ సందర్భంగా అన్నదానం ప్రభు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాను అయ్యప్ప స్వామి నమ్ముకున్న వారికి అన్ని విధాల భగవంతుడు తోడుగా ఉంటాడన్నారు కోరుకున్న ప్రతి ఒక్క కోరిక నెరవేరి వారి కుటుంబం వృద్ధి చెందుతుంది అన్నారు.అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం ఆ భగవంతుడు ప్రతి ఒక్కరి కోరికలు తీర్చే కలియుగ ప్రత్యక్ష దైవం అయ్యప్ప స్వామి అన్నారు.
ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు,మాజీ అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళీ గురుస్వామి తూర్పాటి శంకర్ గురుస్వామి చింతల సాయిలు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి సుక్క సుదర్శన్ పెద్ద గొని రమేష్ గౌడ్ అంతటి రాము గుత్తికొండ సుధీర్ తూర్పునూరు నాగరాజు అనంత రామయ్య చౌదరి కిలారి రవణ మాదాని సంపత్ గార్లు తదితరులు పాల్గొన్నారు.



# వృక్షజాతిని సంరక్షించాలి

- కార్తీక వనసమారాధన మన సంప్రదాయం
- వన భోజనంతో పుణ్యఫలం
- మానవ మనుగడ లో వనాల మేలు ఎనలేనిది
- వనమారాదన వేడుకల్లో శాసన సభ్యులు జగదీష్ రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి:** ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం , ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు మనకు చాటిచెబుతాయని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూర్ ఎస్ మండలం నెమ్మికల్ లో సంతోషి మాతా రూపాదేవి ట్రస్ట్ ఆధ్వర్యం లొ ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ లో కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసన సభ్యులు జగదీష్ రెడ్డి,శివ లింగాలతో మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శివలింగాలకు భక్తులు క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశసంస్కృతి ,సంప్రదాయాలను , హైందవ ధర్మ మార్గాన్ని అనుసరించి అనాదిగా వస్తున్న ఎన్నో పర్వదినాలను మనం పాటిస్తూ వస్తున్నాం అన్నారు. ఇందులో భాగమే కార్తీక మాసంలో జరుపుకునే వన సమారాధన కార్యక్రమం అన్నారు . భారతీయ ఆయుర్వేదంలో వృక్ష జాతికి ఉన్న ప్రాముఖ్యత అందరికీ తెలిసిన విషయమే అన్న జగదీశ్ రెడ్డి అందుకే మంచు కురిసే సమయంలో ఉసిరి చెట్టు కింద విష్ణువు పూజించి , వండిన ఆహారాన్ని ఆ చెట్టు కిందే ఆరగిస్తే కార్తీక మాసంలో గొప్ప పుణ్యఫలం దక్కుతుందని కార్తీక పురాణం చెబుతోంది అన్నారు.కేవలం భోజనాలకే పరిమితం కాకుండా ఆటలు , పాటలు కబుర్లకు ఇది చక్కటి వేదిక అన్నారు .పిల్లలు , పెద్దలలో ఉన్న సృజనాత్మకతను తట్టిలేపే క్రీడలు , నృత్యాలు , సంగీత కచేరీలు నిర్వహించడానికి మంచి అవకాశం అన్నారు.వనభోజనాల మధుర స్మృతులు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. మానవ మనుగడకు వనాలు చేసే మేలు అంతా ఇంతా కాదన్నారు. భవిష్యత్ తరాలకు కూడా మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షించాలనే నిగూఢ సందేశాన్ని వనసమారాధన అందిస్తోంది అన్నారు.




# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆర్.డి.ఓ వీరబ్రహ్మ చారి.**

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్. డి.ఓ వీర బ్రహ్మ చారి అన్నారు. పేదలకు, మహిళకు రెండు పథకాలు ఎంతో ఉపయోగ పడే అద్భుత పథకాలని అన్నారు. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నియోజక వర్గ స్థాయిలో పరిధిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహాలక్ష్మి పథకాన్ని జెడ్.పి సి.ఈ. ఓ సురేష్, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్ రెడ్డి లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుగా చేపట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ, మహాలక్ష్మి పథకాలు పేద ప్రజలకు, మహిళలకు ఎంతో ఉపయోగపడతాయని మహిళా సాధికారతకు దిశగా తొలి అడుగని అన్నారు. ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ. 10 లక్షల వైద్య సహాయం పెంచిందని అర్హులైన ప్రతి ఒక్కరు ఇట్టి సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా ఏరియా ఆసుపత్రి నందు ఆరోగ్య శ్రీ వాల్ పోస్టర్ ను ప్రారంభించడం అలాగే నూతన బస్టాండ్ నందు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళ ప్రయాణికులతో బస్సులో పట్టణంలో ప్రయాణించారు.ఈ కార్యక్రమంలో డి.యం. సురేందర్, తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, వైద్య, ఆర్.టి.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమం

**జిల్లా కార్యదర్శి కేలోత్ సాయి కుమార్**

**మహబూబాబాద్, విశాల భారతి:** రూరల్ మండలం రెడ్యాల బాయ్స్ ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమం చేయడం జరిగింది.అనంతరం వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది.విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయి కుమార్, డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య ప్రకాష్. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారమే పోరాటంగా విద్యార్థులకు సమాన విద్యా అందడమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని అందుకోసం జరిగే పోరాటంలో విద్యార్థులందరూ భాగ్య స్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్య రంగానికి 30% బడ్జెట్ కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి,నాయకులు వంశీ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్

# ఉద్యమకారులపై కేసులని ఎత్తివేయాలి

**నకిరేకల్, విశాలభారతి:**తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన విద్యార్థి ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ అదేవిధంగా గత 30 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం తమ ప్రాణాల సైతం లెక్కచేయకుండా అనేక నిర్బంధాలను అధిగమిస్తూ ధర్నాలు రాస్తారోకోలు బందులు చేస్తూ జాతీ లక్ష్యం కోసం జైలు పాలై ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూ అనేక ఇబ్బందులు పడుతూ సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఎంఆర్పిఎస్, విద్యార్థి ఉద్యమకారులపై నమోదైన కేసులను తక్షణమే ఎత్తివేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చేకూరి గణేష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



# కాళోజీ స్ఫూర్తితో ఉద్యమం చేసినం - కాటం వెంకటేష్

- ప్రాణాలకు తెగించి కొట్లాడినం
- బిఆర్ ఎస్ పార్టీ లో ఉద్యమకారులకు అవమానం
- కాంగ్రెస్ తోనే ఉద్యమకారులకు,అమరులకు గౌరవం
- ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయడం పట్ల హర్షం



**చిట్యాల, విశాలభారతి:** ఉద్యమానికి పురుడుబోసిన కాలోజి నారాయణరావు, ఉద్యమానికి ఊతమిచ్చిన అందెశ్రీ ల ఆశయ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పోరాటం చేశామని సీనియర్ ఉద్యమకారులు చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం అన్నారు. చిట్యాల పాల కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల ముఖ్య సమావేశంలో ముఖ్య అతిథిగా వెంకటేశం పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోరాట ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమకారులను పట్టించుకోలేదని చీపురు పుల్లల వాడుకొని వదిలేశారని వాపోయారు. బిఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు సభ్యత్వాలు కూడా ఇవ్వకుండా అవమానించారని ఆసమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే వేముల వీరేశం అప్పుడు మాకు నేను అండగా ఉంటానని ధైర్యం చెప్పారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని, అమరుల కుటుంబాలను ఆదుకుంటామని అలాగే 250చ.గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇవ్వడం, ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై నమోదైన కేసులను పూర్తిగా రద్దు చేయడం ఉద్యమకారుల పట్ల కాంగ్రెస్ పార్టీ కున్న వైఖరి స్పష్టమైందని కాంగ్రెస్ పార్టీలోనే ఉద్యమకారులకు గౌరవం దక్కుతుందని పునరుద్ఘాటించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం ని నియోజకవర్గ ప్రజలు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించారని ఆయన నాయకత్వంలో ఉద్యమకారులమంతా పని చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రకటించిన ఆరు హామీల్లో హామీలను సోనియాగాంధీ జన్మదినం రోజు అమలుపరచడం గొప్ప విషయమన్నారు.

ఈ సమావేశంలో ఉద్యమకారులు కోనేటి యాదగిరి, జక్కలి మల్లేశం, కొండ కింది వెంకటరెడ్డి, గోలి మహేష్, కురాకుల సురేష్, ఆరూరి పాండు, చిరగొని గణేష్, సాగర్ల నరేష్, మెట్టు అశోక్, మెట్టు నరసింహ, మామిడి స్వామి ఆవుల సత్యనారాయణ మెట్టు రాకేష్ లోడే లింగస్వామి తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.



# మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేముల

**నకిరేకల్ ,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలోని 5వ బ్లాక్ లో మంత్రి చాంబర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# కోదాడ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా

- ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి ఘన స్వాగతం పలికిన ప్రజలు& నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ, విశాల భారతి:** నియోజకవర్గ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా కోదాడకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆదివారం నియోజకవర్గ సరిహద్దు అయినా మునగాల మండలం మాధవరం గ్రామం నుండి నియోజవర్గ ప్రజలు దారి పొడవునా పూల వర్షం కురిపిస్తూ జననీరాజనాలు పలికారు. మహిళలు హారతులు, నృత్యాలు చేస్తూ, గజమాలలతో సన్మానిస్తూ, హర్షద్వానాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కోదాడ ప్రజలకు ఎప్పటికి రుణపడి ఉంటానని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, మునగాల మండల కాంగ్రెస్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎంపీపీ ఎలక బిందు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, మండల నాయకులు, రామినేని శ్రీనివాసరావు, కంపాటి శ్రీను, ఈధుల కృష్ణయ్య, సామినేని ప్రమీల, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీలో వికలాంగుల కోటా తేల్చండి

**భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దే రాజేష్**

**గరిడేపల్లి, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో వికలాంగుల కోట తేల్చేందుకు కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే చొరవ తీసుకోవాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపి యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం నరేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన రాజేష్ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉన్న వికలాంగులకు వెంటనే ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతోపాటు పెన్షన్ 6000 అందజేయాలని అన్నారు. అంతే కాకుండా విడతల వారీగా అన్ని జిల్లాల్లోనూ వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాల ఖాళీలను గుర్తించి వెంటనే భర్తీ చేయడంతోపాటు రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు నూతన ముఖ్యమంత్రి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా వికలాంగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాటుపడుతుందని తాము ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా రావడంతో తమ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని తాము భావిస్తున్నామని అన్నారు. నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి కి తమ సంఘం పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తూనే తమ సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు,సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపి యాదవ్, సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం నరేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సేవలో ప్రజా ప్రభుత్వం

**ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**

**కోదాడ, విశాల భారతి:** ప్రజల సేవలో ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుందని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో 10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సహాయం పథకం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ జె దశరధ నాయక్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి పాల్గొని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ పార్టీ వారి యొక్క సొంత స్వలాభాలకు అధిక మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు కానీ పేద ప్రజలకు ఎక్కువ ఖర్చయ్యే వైద్యంపై దృష్టి సారించలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయం కింద పది లక్షల రూపాయలు ప్రభుత్వమే భరిస్తుందని ఆమె అన్నారు. కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించటానికి డాక్టర్లు నిరంతరం కృషి చేస్తున్నారని వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గతంలో కంటే కోదాడ హాస్పిటల్ సేవలు ఎక్కువగా ప్రజలకు అందిస్తున్న హాస్పటల్ సిబ్బందికి, హాస్పటల్ సూపర్డెంట్ దశరథ నాయక్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, కోదాడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ వనపర్తి శిరీష, ఆర్డీవో సూర్యనారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, డాక్టర్లు సురేష్ నారాయణ, బావ్ సింగ్, మమత, వైష్ణవి, రసజ్ఞ రెడ్డి, లక్ష్మణ్, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, సామినేని ప్రమీల, రామారావు, రజనీకాంత్, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.





# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**శాలిగౌరారం,విశాలభారతి:** జడ్పి స్కూల్ లో 1995 96 సంవత్సరం లో కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక్కటయ్యారు.. శాలిగౌరారం లోని సీ.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 27 సంవత్సరాల తర్వాత ఒకే వేదిక మీద కలుసుకోవడం తో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆప్యాతగా పలకరించుకున్నారు. తమకు విద్యబుద్ధులు నేర్పించిన గురువులైన సుధాకర్ రెడ్డి, కండె శ్రీనివాసరావు, యుగేందరా చారి,ఎకబాల్ అహ్మద్ లను ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయులు తమకు విద్యాబోధన ఎలా చేశారు, తమకు ఏ విధంగా క్రమశిక్షణ నేర్పించారని కొనియాడారు. సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులకు కృతగ్యతలు తెలిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుజలాల్ శేఖర్ బాబు, డెంకల సత్యనారాయణ,దాసోజు శంకరాచారీ, తోట జగన్మోహన్,యాదగిరి,నరిసింహ, దయాకర్, జానయ్య, జగదీశ్,పాక మంజుల, రాజేశ్వరి,రషీద,రమణ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన జి.కె

**ఆమనగల్లు, విశాల భారతి :** కల్వకుర్తి నియోజకవర్గం నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసిన వారిలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్,ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు ఉన్నారు.



# కవ్వంపల్లికి శుభాకాంక్షలు తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు

**చిగురుమామిడి, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ శాసనసభ్యులుగా విజయం సాధించి ఆదివారం విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగంగా కొత్తపల్లి స్టేజ్ వద్ద చిగురుమామిడి జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పుష్ప గుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియాజేశారు. వీరి వెంట జిల్లా అధికారప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, డిసిసి అధికారప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గునుకుల రాజేశ్వర్ రెడ్డి, ములుకనూర్ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్, కాటం సంపత్ రెడ్డి, కాటం సంజీవరెడ్డి, సాంబారి బాబు తదితరులు పాల్గొన్నారు.



# సీఎంను కలిసిన రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు

**ఆమనగల్లు, విశాల భారతి:** రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ అలీఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎంగా ఎన్నికైన ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఆసిఫ్ అలీ.. రేవంత్ మిత్రమండలిని స్థాపించి గత కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆసిఫ్ అలీని సీఎం ఈసందర్భంగా అభినందించారు.



# ఎమ్మెల్యేను కలసిన కాంగ్రెస్ శ్రేణులు.

**నర్సింహులపేట, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజికవర్గ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ లాలి తండా కాంగ్రెస్ లీడర్లు హైదరాబాద్ లో కలిసి సన్మానించారు.డోర్నకల్ ఎమ్మెల్యే గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. డోర్నకల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పై ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని , తెలంగాణ ప్రజలు మార్పును కోరుకున్నారని , సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. డోర్నకల్ ప్రజలు నియంత పాలన పట్ల విసుగు చెందారని,ఓట్ల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పారన్నారు.కార్యక్రమంలో గుగులోతు రాముడు,అనిల్,రాజశేఖర్,దనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడ ఎమ్మెల్యేకి పరామర్శ

**నకిరేకల్ ,విశాలభారతి:** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి ఇంటికెళ్ళి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కుటుంబ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ఎమ్మెల్యేని కలిసిన విద్యానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం సభ్యులు

**ఆమనగల్లు, విశాలభారతి:** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని అమనగల్లు మున్సిపాలిటీ విద్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్ప గుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు కాలనీ సమస్యలు పలు అంశాలపై చర్చించినట్లు కాలనీ అధ్యక్షులు యంఎ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మానుపాడు జంగయ్య, కోశాధికారి జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి, ముఖ్య సలహాదారులు పాండు, చెన్నారెడ్డి పత్యా, కమిటీ సభ్యులు పర్వతాలు, ఆరిఫ్, గుజ్జరి నర్సింహా, లక్ష్మినారాయణ, రమేష్ పాల్గొన్నారు.



## మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ఖేడ్ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ నియోజకవర్గం మండలంలోని రాజీవ్ చౌక్ ఆర్టీసీ బస్టాండ్ లో మహాలక్ష్మి పథకంలో భాగమైన ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు.

# ప్రజలతోనే మేము'

**ఇబ్రహీంపట్నం, విశాలాభారతి:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, తాము గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటామని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బొంగ్లూరులోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాము అనుకున్న ఫలితం రాలేదని, దీనికి కొంత నిరాశ ఉన్నా... కార్యకర్తలు కృంగిపోవాల్సిన అవసరం లేదని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎప్పటిలా, అదే ఉత్సాహంతో పనిచేయాలని, రానున్న ఎన్నికల్లో పడిలేచిన కెరటంలా విజృంభించాలని ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. బలమైన ప్రతిపక్షంగా, ప్రజల గొంతుకై నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు



క్యామ మల్లేష్, రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సత్తు వెంకటరమణ రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వంగేటి లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, యాచారం జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ రెండు గ్యారంటీ పథకాలను ప్రారంభించిన నాయకులు

**బాల్కొండ, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం, చేయూత రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సాయం రూ.10 లక్షల పథకాని భీమ్‌గల్ మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్,ఎంపిపి ఆర్మూర్ మహేష్,జెడ్పీటీసీ చౌట్ పల్లి రవి,నోడల్ అధికారి,జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గోవింద్,భీమ్‌గల్ డిపో మేనేజర్, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. చేయూత రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయం బ్రౌచర్ ను వారు ఆవిష్కరించారు. అనంతరం భీమ్‌గల్ బస్ స్టాండ్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో రమేష్, మెడికల్ ఆఫీసర్ అజయ్ పవర్, తహసిల్దార్, ఎంపీడీవో,ఎంపిటిసిలు సర్పంచులు, కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థినీ ఎంపిక

**సైదాపూర్, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియం లో ఈనెల 4 న జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్ 17 బాలికల విభాగంలో అథ్లెటిక్ జావలిన్ త్రో ఈవెంట్ పోటీల్లో సైదాపూర్ మండలం సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థినీ అంజలి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఎంపిక అవడం జరిగింది. ఈ నెల 7 నుండి 9 వరకు హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థి అంజలినీ ఆదర్శ



పాఠశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ ఫర్హానా, వైస్ ప్రిన్సిపాల్ మోయిస్ ,ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణు వర్ధన్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



## కార్యకర్తలకు అండగా ఉంటా

**బాల్కొండ, విశాల భారతి:** ఓటమి పాఠం నేర్పిందని, నైతికంగా గెలుపు మనదేనని, ఎన్నికల్లో మితిమీరిన ధన ప్రవాహం వల్ల ఓటమి మూటగట్టుకోవాల్సి వచ్చిందని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం లలితా గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అక్రమ ధన సంపాదన ప్రజలపై వెదజల్లి గెలిచిందని, అమాయక ప్రజలు డబ్బుకు మోసపోయారని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎటువంటి కష్టం రాకుండా చూసుకుంటానని అన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మోసం చేసిన ఇంటి దుష్టశక్తులను వదిలిపెట్టేది లేదని అంతా ముఖ్యమంత్రికి తెలుసని వాళ్ళ పని ఆయనే చూసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు హుస్నాబాద్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**సైదాపూర్, విశాల భారతి:** హుస్నాబాద్ నుండి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులుగా నియమితులైన పొన్నం ప్రభాకర్ గౌడ్ తొలిసారిగా హుస్నాబాద్ కు వస్తున్నారని వెన్నంపల్లి సింగల్ విండో మాజీ అధ్యక్షులు సారబుడ్ల రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో ఉదయం 7 గం.లకు బయలుదేరి, తుర్కపల్లి, గజ్వేల్, ప్రజ్ఞాపూర్,సిద్దిపేట మీదుగా మధ్యాహ్నం 2 గం.లకు బస్వాపూర్ కు చేరుకుంటారు. అక్కడి నుండి హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు ఘన స్వాగతం పలకలాని హుస్నాబాద్ పట్టణ శివారు నుండి ఊరేగింపుగా బయలుదేరి 4 గం.ల వరకు అంబేద్కర్ చౌరస్తా కు చేరుకుంటారాన్నారు. అక్కడ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రసంగిస్తారు.





## ఖేడ్ ఎమ్మెల్యేకు సన్మానం

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులకు ఆయన నివాసంలో పూలమాలవేసి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కశీనత్ మందిర్ చైర్మన్ హనుమాన్లు సేట్, వేద పండితులు గురురాజ్ శర్మ, సాయి సెట్ ప్రభు రాజ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

## పొన్నం ప్రభాకర్ కు మంత్రివర్గంలో చోటు దక్కడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం

**సైదాపూర్, విశాల భారతి** హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మొదటి సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ గౌడ్ కు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో రవాణా శాఖ,బీసీ సంక్షేమ శాఖ కేటాయించారు. కరీంనగర్ పట్టణానికి చెందిన పొన్నం ప్రభాకర్ గౌడ్ 200914 లోక్ సభ కు కరీంనగర్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. కరీంనగర్ లోక్‌సభ నుంచి ఎన్నుకోబడిన ఎంపీలలో పొన్నం ప్రభాకర్ చిన్న వయస్కుడు. 2009లో పునర్ విభజనలో భాగంగా కరీంనగర్ జిల్లా ఇందుర్తి నియోజకవర్గాన్ని హుస్నాబాద్ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. 2009 ఏర్పడిన హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి ప్రవీణ్ రెడ్డి గెలుపొందారు. బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ మొదటి సారి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటుగా జిల్లా నుంచి మంత్రి వర్గంలో చోటు దక్కడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెన్నంపల్లి సింగల్ విండో మాజీ అధ్యక్షులు సారబుడ్ల రాజిరెడ్డ, సింగల్ విండో డైరెక్టర్ గడ్డం అబ్బయ్య, కాంగ్రెస్ నాయకులు వీరగోని శంకర్, సదానందం, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు కాశపాక అనిల్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు కాశపాక రాజు, కాశపాక వంశీ, నివాస్, నితిన్, హరీష్, అమర్, కౌశిక్ హర్షం వ్యక్తం చేశారు.





## మంచిర్యాలలో బీఆర్ఎస్ కు బిగ్ షాక్

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. పలువురు కీలక నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, 28వ వార్డు కౌన్సిలర్ సాయి భార్గవి, 29వ వార్డు కౌన్సిలర్ చైతన్య సత్యపాల్ రెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ జగ్గారి సుమతి సంజీవ్ ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి అధికారంలో వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ లలో రెండింటిని ప్రభుత్వం వచ్చిన రెండు రోజులలో పూర్తి చేసి ప్రజలలో నమ్మకాన్ని కలుగజేసిన పార్టీతో మాకు న్యాయం జరుగుతుందని వారు కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందని వారు అన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చేవెళ్ల, విశాల భారతి :** ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం... చదువులమ్మ చెట్టు నీడన అంటూ... ఓ సినీ కవి రాసిన పాటను వారు నిజం చేశారు. సుమారు 18 ఏళ్ల తర్వాత వారందరూ ఒకచోట కలుసుకున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20052006 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కౌకుంట్లలోని జడ్పీహెచ్ఎస్ లో సమావేశం నిర్వహించుకున్నారు. మొత్తం 120 మంది విద్యార్థులకు గాను 60 మంది కార్యక్రమానికి హాజరయ్యారు. 18 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, ఎన్ని పనులు ఉన్నా పక్కనపెట్టి స్నేహితులను కలుసుకోవడానికి ఇక్కడికి వచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

## స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులుగా యాదగిరి సత్తయ్య

**మందమర్రి టౌన్, విశాల భారతి:** స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులుగా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు గోదావరిఖని పట్టణంలో సిఈఆర్ క్లబ్, ఆర్జి Iలో ఆదివారం జరిగిన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ సన్నాక సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యలపై చర్చించే అత్యంత ప్రాధాన్యత కలిగిన స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులుగా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ను నామినేట్ చేసినట్లు కొత్త కాపు లక్ష్మారెడ్డి స్టాండేషన్ కమిటీ ఆన్ సేఫ్టీ బోర్డు బి.ఎం.ఎస్ జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, సీఎంపీఎఫ్ ట్రస్ట్రీ బోర్డ్ సభ్యులు ఇట్టి సమావేశంలో ప్రకటించారు. సింగరేణి నుండి అత్యధిక ప్రాధాన్యత కల్పించి స్టాండేషన్ కమిటీ సభ్యులుగా నియమించినందుకు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ కేంద్ర కమిటీ తరపున కొత్తకాపు లక్ష్మారెడ్డికి అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి టి.స.పవన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## బీఆర్ఎస్ నాయకుడి నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

**చేవెళ్ల, విశాల భారతి:** చేవెళ్ల మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగ శ్రీధర్ రెడ్డి నూతన గృహ ప్రవేశం ఆదివారం ముడిమ్యాల్ గ్రామంలో నిర్వహించారు. నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ మాలతీ, వైస్ ఎంపీపీ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ మెన్ మిట్ట వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సిములు, ముడిమ్యాల్ సర్పంచ్ శేరి స్వర్ణలతా దర్శన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, కౌకుంట్ల రైతు బంధు సమితి అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లాలపెట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనబోజనాలు

**సికింద్రాబాద్, విశాల భారతి :** లాలపెట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఓయూలో కార్తీక మాస వనబోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు ప్రత్యేకంగాపూజలు నిర్వహించి అనంతరం పలు సాంస్కృతికార్యక్రమాలు నిర్వహించి ఉల్లాసంగా ఉత్సహం గడిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి ఎన్ శెట్టి. భాస్కర్, మాజీ అధ్యక్షుడు కృష్ణ, ఇంగు వెంకటేశం, యం. వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాస్, బలరాజ్ గుప్త, మహిళ అధ్యక్షురాలు ఎన్ శెట్టి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి టి. స్వాతి, కోశాధికారి రాజ్యలక్ష్మి, మహిళలు సభ్యులు పాల్గొన్నారు.

## లాలపెట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా మడిపడగ శ్రీనివాస్

**సికింద్రాబాద్, విశాల భారతి :** లాలపెట్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మడిపడగ శ్రీనివాస్ గుప్తా నియమితులయ్యారు. సభ్యులు సమావేశంలో ఎన్నికల ద్వారా ఎన్నికయ్యారు. సమీప అభ్యర్థి లక్ష్మణ్ పై గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పందిరి సాంబశివరావు, కోశాధికారి ఎన్ శెట్టి భాస్కర్ నియమితులయ్యారు. శాశ్వత గౌరవ అధ్యక్షుడు నేతి రాములు గుప్తా ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.
శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న 350 సభ్యత్వన్ని పెంపొందించి,సంఘానికి సేవా కార్యక్రమాలు నిరుపేద వైశ్యులకు వివాహాలు జరిపించుటకు కృషి చేస్తానని, ఇతర వర్గాల నిరుపేదలకు కూడా సహాయ సహకారాలు అందిస్తామనని సంఘం అభివృద్ధి గురించి కృషి చేస్తానని చెప్పారు. ఈ నెల 31న,లాలపెట్ నఫీజ్ గార్డెన్ లో జరిగే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనలని కోరారు. తనను ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు.



# పరిశోధనలో ఊహాప్రతిపాదన శాస్త్రీయంగా ఉండాలి

**శేరిలింగంపల్లి విశాల భారతి:** పరిశోధనలో ఊహ ప్రతిపాదన గుండెకాయలాంటిదనీ, అది విశ్వసనీయతతో రూపొందించుకోవడం ద్వారానే శాస్త్రీయమైన పరిశోధనలు సాధ్యమవుతాయని హెచ్ సియు తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పిఆర్ఆర్,వి.ఎస్.ప్రభుత్వ కళాశాల తెలుగు పరిశోధన కేంద్రం, డి.కె.ప్రభుత్వ మహిళా కళాశాల నెల్లూరు వారు సంయుక్తంగా అంతర్జాలం ద్వారా నిర్వహిస్తున్న 'పరిశోధనావిధానం' రెండు రోజుల (910, డిసెంబర్ 2023 ) కార్యశాలలో భాగంగా ఆదివారం 'పరిశోధనలో ఊహాప్రతిపాదనప్రాధాన్యత' అనే అంశంపై ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ప్రసంగించారు. పరిశోధన ప్రణాళికలో ఊహాప్రతిపాదన సూటిగా,స్పష్టంగా, వివరణాత్మకంగా ఉండాలనీ, గతంలో జరిగి పోయిన వాటినే తాను మరలా పరిశోధన చేస్తూ పునరుత్పత్తి చేయడం,దాన్ని దాచేసి ఊహాప్రతిపాదన చేసినట్లు చేయకూడదని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు ప్రశ్నలకు వివరణలతో తెలుగు పరిశోధన పద్ధతులపై లోతైన చర్చ జరిగింది.





# ప్రజలు కోరుకున్న తెలంగాణ సాకారం కానుంది

**కాంగ్రెస్ వచ్చింది ప్రజల కష్టాలు తీరనున్నాయి**

**షాద్ నగర్ విశాలభారతి:**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరడంతో ప్రజలు, ఉద్యోగస్తులు,ఉద్యమకారులు కోరుకున్న తెలంగాణ సాకారం కానుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ నుండి ఏఎన్ఎం దాకా ఉద్యోగ పరంగా స్వేచ్ఛ లేక నిర్బంధమైన సేవలు అందించారని వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో విముక్తి లభించనుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు అమలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం లాంటిదని, ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిమితి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం 1383 రోగాలకు చికిత్సలు, సర్జరీలు, 289 వైద్య రుగ్మతలకు వరిస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల మందికి రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పది లక్షల రూపాయల వైద్య భరోసా కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం దశలవారీగా ప్రజలకు అన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, అదనపు అధికారిని డాక్టర్ జయలక్ష్మి,ఫరూక్ నగర్ జెడ్పిటిసి పి.వెంకట్రామిరెడ్డి, కేశంపేట జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి,ఆర్డీవో వెంకట మాధవరావు, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# రాష్ట్ర మంత్రులకు రాష్ట్ర సగర సంఘం శుభాకాంక్షలు

**శేరిలింగంపల్లి విశాల భారతి:**నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు రాష్ట్ర మంత్రులను తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు కలిసి మంత్రులకు సన్మానం చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లను తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, రాష్ట్ర నాయకులు కెపి రామ్ సగర, రాష్ట్ర మహిళా సంఘం నాయకురాలు స్రవంతి సగర, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి సగర, రాష్ట్ర యువజన సంఘం నాయకులు సందుపట్ల రాము సగర, సందుపట్ల సాయి గణేష్ సగర,గ్రేటర్ యువజన సంఘం అధ్యక్షులు సీతారాం సగర, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ సగర, వరంగల్ జిల్లా మహిళా సంఘం కోశాధికారి రుద్రమదేవి సగర, మాందాపూర్ గ్రామ సర్పంచ్ జయరాములు సగర, బెక్కెం గూడెం సర్పంచ్ చక్రవర్తి సగర, పానుగల్ మండల అధ్యక్షులు గోవర్ధన్ సగర, రవి సగర, ఉమేష్ సగర తదితరులు పాల్గొన్నారు.



# శంకరన్న గెలిచాడు

**202 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్న అభిమానులు**

**కొత్తూరు విశాలభారతి:**షాద్ నగర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలిస్తే గ్రామదేవతకు తలా 101 కొబ్బరికాయలు కొడతా మంటూ స్థానిక యువకులు మేక్మొండ ఆనంద్ , మేక్మొండ పవన్ లు అంతిరెడ్డి కూడా శివారులో ఉన్న ఈదుల రేణుక ఎల్లమ్మ మాతను మొక్కుకున్నారు. వారి ఆశలు నెరవేరడంతో ఆదివారం నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామంలోని ఎల్లమ్మతల్లి ఆలయంలో వీర్లపల్లి శంకర్ సమక్షంలో 202 కొబ్బరికాయలు కొట్టి ఇరువురు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిల్లెల్ల రామ్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, సీనియర్ కాంగ్రెస్ నేత దేపల్లె శంకరయ్య గౌడ్,ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ,చంద్రపాల్ రెడ్డి,దేపల్లె కుమార్ గౌడ్ నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావాలి కృష్ణ , దేపల్లె మల్లేష్ గౌడ్,కుందారం వెంకటరెడ్డి,అబ్దుల్ గని,తుమ్మల నరసింహులు యాదవ్,శ్రీశైలం గౌడ్ , కుమ్మరి కృష్ణ,తీగాపూర్ ఆంజనేయులు, చిందం నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పాలనలో చేనేతకు పూర్వం వైభవం.

- **హామీ మేరకు చేనేత పై జిఎస్టి భరించాలి.**
- **చేనేత వర్గాల చైతన్య వేదిక జాతి అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాస్.**

**ముషీరాబాద్,విశాల భారతి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండి చేనేతకు పూర్వం సంచరించుకుంటుందని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాస్ పేర్కొన్నారు. ఇకపై రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండవని తెలిపారు. బాగ్ లింగంపల్లి లోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేనేత కార్మికులు ఉత్పత్తులపై పడే జిఎస్టి ని ప్రభుత్వమే భరిస్తుందని రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలోని చేనేత ఉత్పత్తి దాదాపు 1000 కోట్లు ఉంటుందని ఐదు శాతం జీఎస్టీ ప్రభుత్వం భరిస్తే కార్మికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఆర్థిక రంగాలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న చేనేత రంగం యొక్క జీవనోపాధి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పాలన ఎంతో దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ శ్రీనివాస్, కే సుదర్శనరావు, చక్రపాణి, నాగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# 'అభినందనల వెల్లువ'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మలక్‌పేటలోని నివాసంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. బొకే అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుకోసం అనునిత్యం కృషి చేసిన నాయకులకు రంగారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా నాయకులు, కార్యకర్తలు చూడాలని రంగారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, డా.రాగ్యానాయక్, దేశ్యానాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవులు మున్నాళ్ళ ముచ్చటేనా?

- **మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రాజీనామా తప్పదా?**
- **సంవత్సరము కాకముందే పదవి గండం**



**విశాల భారతి ఆమనగల్లు ::** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము మారుతున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు రాజీనామాలు కొనసాగిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ నియమించిన నామినేటెడ్ పదవులకు పలువురు చైర్మన్లు రాజీనామాలు చేశారు.వారి బాటలోనే కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సైతం రాజీనామా రాజీనామా చేస్తారా?లేదా అనేది తేలాల్సి ఉంది. మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ :: రాష్ట్ర మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గా తలకొండపల్లి మండలానికి చెందిన జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ను నియమిస్తూ అక్టోబర్ 5న ఉత్తర్వులు జారీ అయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ బలోపేతంకై ఆగష్టు 18న ఉప్పల వెంకటేష్ ను మాజీ మంత్రి కేటీఆర్ బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన తర్వాత సముచిత స్థానం కల్పిస్తామనే హామీ మేరకు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ గా నియమించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవడంతో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ పదవి ఉంటుందా ఉండదా అని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి.

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు.**



**ముషీరాబాద్,విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరగా కోలుకోవాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం బెంగళూరులోని గణపతి దేవాలయం, దొడ్డ బసవన్న దేవాలయం, బిగ్ బుల్ దేవాలయంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కెసిఆర్ సేవలు తెలంగాణకు అవసరమని ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు.



# గత స్మృతులు అద్భుతం.

**ముషీరాబాద్,విశాలభారతి:** గత స్మృతులను గుర్తు చేసుకుని పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం విశేషంగా ఆకట్టుకుంది. అయితే అప్పుడు ఇప్పుడు కాదు 1969 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు అందరూ కలవడం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం గొప్ప విషయం.. ఆదివారం మలక్పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1969 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నారాయణగూడ లోని తాజ్ మహల్ హోటల్ లో అంగరంగ వైభవంగా జరిగింది. పూర్వ విద్యార్థులు సిటీ పార్థసారథి, షణ్ముఖ దీప్ కుమార్, సివి లక్ష్మి,సి. నరసింహారావు తదితరులు గతాన్ని గుర్తు తెచ్చుకొని ప్రస్తుత వారి వారి కుటుంబ సభ్యులతో అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ నేపథ్యాలను కష్టసుఖాలను పంచుకున్నారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా పూర్వ విద్యార్థుల అందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చి ఇలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# ప్రభుత్వం బీసీల ఆకాంక్షలను నెరవేర్చాలి.

**బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిరడి భూపేష్ సాగర్.**



**ముషీరాబాద్,విశాల భారతి:** తనకు మంచి శాఖలను కేటాయించారని గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి సీతక్క అన్నారు. అడవి బిడ్డ గిరిజన మహిళ సీతక్కకు మంత్రి పదవి వచ్చినందున బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిరడి భూపేష్ సాగర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా వారి సంక్షేమం కృషి చేస్తూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన సీతక్క మంత్రిగా ఎన్నికవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. వీరి పాలనలో సమస్యలన్నీ పరిష్కారమే అందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# బస్సులో మహిళకు టికెట్ కొట్టిన కండెక్టర్

**- విచారణకు ఆదేశించిన సజ్జనార్**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని శనివారం ప్రారంభించింది. ఇందులో భాగంగా బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో, సిటీలో అయితే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. కానీ మహాలక్ష్మీ పథకం లో భాగంగా మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన మరుసటి రోజే ఆర్టీసీ బస్సులో మహిళల నుంచి టికెట్ కు ఛార్జీ వసూలు చేశాడు ఓ కండక్టర్. నిజామాబాద్ జిల్లాలో ఇది చోటుచేసుకుంది. ముగ్గురు మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కారు. నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్లాల్సి ఉంది. అయితే ఒక్కొక్కరికి రూ.30 చొప్పు కండక్టర్ వారి వద్ద నుంచి రూ.90 వసూలు చేశాడు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అందులో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో మహిళకు ఉచిత ప్రయాణం కల్పించారని మహిళలు చెప్పినా కండక్టర్ వినలేదు. తాను మాత్రం టికెట్ కొడుతున్నానని చెప్పి వారి వద్ద నుంచి ఛార్జీలు వసూలు చేయడం వివాదాస్పదం అవుతోంది. మహిళలకు ఛార్జీ డబ్బులు తిరిగిచ్చేయాలని కొందరు చెప్పినా కండక్టర్ పట్టించుకోలేదు. పైగా డబ్బులు తిరిగిచ్చేది లేదన్నట్లు ప్రవర్తించారు. కండక్టర్ ఆ మహిళా ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించారని, ఆర్టీసీ సూచనలు, ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా నడుచుకున్నారని బస్సులోని తోటి ప్రయాణికులు ఆరోపించారు.

**విచారణకు ఆదేశించిన సజ్జనార్..**

ఉచిత బస్ సౌకర్యం అమల్లో ఉన్నా కండక్టర్ మహిళల నుంచి టికెట్ ఛార్జీలు వసూలు చేయడంపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డిపో పరిధిలో ఒక మహిళకు టికెట్ జారీ చేసిన ఘటనపై విచారణకు ఆదేశించినట్లు సజ్జనార్ తెలిపారు. సంబంధిత కండక్టర్ ను డిపో స్పేర్ లో ఉంచినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం ఆ కండక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యంపై ఆడవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని ద్వారా తమకు నెలకు వెయ్యి నుంచి మూడు వేల వరకు మిగులుతుందని, వాటిని ఇంటి ఖర్చుల కోసం, ఇతరత్రా అవసరాలకు వాడుకుంటామని చెబుతున్నారు. ప్రైవేట్ వాహనాల సమస్య తప్పడంతో పాటు మహిళలకు సెక్యూరిటీ కూడా ఉంటుందని చెబుతున్నారు.

## బీసీ బంధుకు బ్రేక్
# బీఆర్ఎస్ పథకం స్టాప్


- **త్వరలోనే రివ్యూ**
- **ఆరుగ్యారెంటీల్లో రెండింటిని అమలు చేశాం**
- **ఆర్టీసీ విలీనం జరగలేదు**
- **బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**తెలంగాణలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కంటిన్యూ చేస్తుందా.. నిలిపేస్తుందా.. అన్న కన్ఫ్యూజన్‌లో ఉన్న రాష్ట్ర ప్రజలకు నిరాశ కలిగించే వార్త వినిపించారు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించేందుకు బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే.. బీసీ బంధు కోసం చాలా మంత్రి దరఖాస్తు చేసుకోగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తూ.. చేయూత అందించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో.. బీసీ బంధు పథకాన్ని తాత్కాలికంగా నిలిపేయాలని నిర్ణయించింది. అయితే.. త్వరలోనే బీసీ బంధుపై రివ్యూ నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అప్పటి వరకు తాత్కాలికంగా పంపిణీని నిలిపివేస్తామన్నారు. బీసీ బంధు ప్రాసెస్‌లో గత ప్రభుత్వం గందరగోళం సృష్టించిందని.. ఇప్పుడు దాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు పొన్నం ప్రభాకర్.తుక్కుగుడ విజయభేరీ సభలో సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటినీ అమలు చేశామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మిగతా గ్యారెంటీలను కూడా అతి త్వరలోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ అంటేనే భరోసా అని చెప్పుకొచ్చారు. ఇక ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వేలకు పైగా బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. రోజూ సగటున 45 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని తెలిపిన పొన్నం.. ఆడబిడ్డలంతా ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. బడ్జెట్ ఎంత ఖర్చైనా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పుకొచ్చారు. మరోవైపు ఆర్టీసీ కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వంలో విలీనం కాలేదన్న పొన్నం.. త్వరలోనే ఆర్టీసీపై సమీక్షించి ఉద్యోగులు, ప్రజలకు మేలు జరిగేలా ముందుకు వెళ్తామన్నారు.ఇక మాజీ మంత్రులు రైతుబంధుపై విమర్శలు చేయడం విచిత్రంగా ఉందన్నారు పొన్నం ప్రభాకర్. ప్రభుత్వం వచ్చి వారం రోజులు కూడా పూర్తి కాకుండానే విమర్శలు చేయటం ఆశ్చర్యకరంగా ఉన్నదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఇచ్చిన అన్ని హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. అధికారం కోల్పోయి బీఆర్ఎస్ పార్టీ నేతలు అర్ధరహిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

# తొలగించిన కులాలను మళ్లీ కలపొద్దు.

- **ఆంధ్ర కులాలను కలపాలని ఆర్ కృష్ణయ్య మాట్లాడడం సరికాదు.**
- **తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ గ్రూప్ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ నరహరి.**



**ముషీరాబాద్,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర బీసీ కమిషన్ అధ్యయనం చేసిన తర్వాతనే ఆంధ్ర ప్రాంతానికి చెందిన 27 బిసి కులాలను తొలగించడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ గ్రూప్ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ నరహరి పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ ఆంధ్ర కు చెందిన ఆ కులాలను కల్పాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కోరాడం సరికాదన్నారు. ఇప్పటికే బీసీ ఏ గ్రూపులో ఉన్న సంచార, యాచక కులాలు దౌర్భాగ్య స్థితిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి కొట్టుమిట్టాడుతుంటే మరోపక్క ఆర్ కృష్ణయ్య ఇలా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ ఏ గ్రూపులో ఉన్న 57 కులాలకు చెందిన వారి సహనాన్ని పరీక్షించొద్దని ఈ కులాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.